క్లుప్తంగా

కొనసాగుతున్న పశుగణన సర్వే

పగిడ్యాల: పశు గణన సర్వే మండల వ్యాప్తంగా కొనసాగుతోంది. అక్టోబర్ నెలలో ప్రారంభమైన పశు గణన సర్వేను పగిడ్యాల, పాత ముచ్చుమర్రి, నెహ్రూనగర్, పడమర ప్రాతకోట గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నారు. మంగళవారం నెహ్రూనగర్‌లో ఎన్యుమరేటర్లు రాజశేఖర్, జి. చరిత సర్వే నిర్వహించారు. సర్వే పూర్తయిన ఇంటికి పశుగణన సర్వే స్టిక్కర్‌ను అంటిస్తున్నారు. పశుసంవర్ధక శాఖ పాడిపరిశ్రమ అభివృద్ధికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఈ సందర్భంగా చరిత రైతులకు వివరించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి


వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు

పాములపాడు: ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలుపై రెండవ బ్యాచ్‌కు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో జేఈ రాఘవేంద్రప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, ఏపీఎం ఉమామహేశ్వరి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


పాములపాడులో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న డీఈ ధనిబాబు

పాములపాడు: సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఈ ధనిబాబు సూచించారు. మండలంలోని బానకచెర్ల, పాములపాడులో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ పల్లె పండుగలో భాగంగా అంతర్గత రహదారుల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి గ్రామంలో త్వరిత గతిన నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నాణ్యతలో తేడా ఉంటే బిల్లులు నిలిపివేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట జేఈ రాఘవేంద్రప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

పీహెచ్‌సీలో సెమీ క్రిస్మస్

మహానంది: ఎం.తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సెమీ క్రిస్మస్‌ను నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భగవాన్‌దాస్, డాక్టర్ వేణు కార్తికేయ ఆధ్వర్యంలో సిబ్బంది సెమీ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం విందు భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత వైద్యుడు నటరాజ్, ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

శ్రీశైలంప్రాజెక్ట్: లింగాలగట్టుకు చెందిన కొవిరి మేరి మంగళవారం మధ్యాహ్నం ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు ఉరి నుంచి తప్పించి సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేశారు.

గ్రామాల సుస్థిరాభివృద్ధికి కృషి

వెలుగోడు: మండల పరిధిలోని గ్రామాల సుస్థిరాభివృద్ధికి కృషి చేయాలని డీపీఓ జమీవుల్లా తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కారాలయంలో సుస్థిర అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఎల్ఎస్డిజిఎస్ అంశంపై వివిధ శాఖల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో దోమలు వృద్ధి చెందకుండా మందు పిచికారీ చేయాలన్నారు. ఆరోగ్యవంతమైన గ్రామం గురించి ఎంపీహెచ్ఇఓ శ్రీనివాసులు మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, పరిసరాల పరిశుభ్రత, మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, ఈవోఆర్డీ మురారి, హెల్పర్ అసిస్టెంట్లు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, సర్వేయర్స్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో నేరాల నియంత్రణ


డ్రోన్‌ను వినియోగిస్తున్న ఎస్ఐ విష్ణు నారాయణ

వెలుగోడు: డ్రోన్ సాయంతో నేరాలను కొంతవరకు నియంత్రించవచ్చని ఎస్ఐ ఎం విష్ణునారాయణ తెలిపారు. మంగళవారం నంద్యాల ప్రధాన రహదారిలో ఓ స్కూల్ వెనుక బహిరంగంగా మద్యం తాగుతున్న ఇద్దరిని డ్రోన్ సాయంతో గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వంతెన... అంతేనా !

- ఎత్తు, వెడల్పుపై స్థానికుల అసంతృప్తి
- సర్వీస్ రోడ్లు నిర్మించకపోవడంతో తప్పని ఇబ్బందులు
- ఎన్‌హెచ్340సీ నిర్మాణంతో ఎదురవుతున్న సమస్యలు
- అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు


చెలిమిల్ల గ్రామ రహదారిలో నిర్మాణం చేపడుతున్న అండర్‌పాస్ బ్రిడ్జి (వంతెన) పనులు

పాములపాడు: సమస్య ఏదైనా రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నేషనల్ హైవే 340సీ (కర్నూలు - అమరావతి) నిర్మాణంలోనూ రైతులకు సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. ప్రస్తుతం నేషనల్ హైవే 340సీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. అయితే చాలా గ్రామాల్లో సర్వీస్ రోడ్డు నిర్మించకుండానే పనులు చేపడుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా చాలా చోట్ల కల్వర్టులు, అండర్‌పాస్ వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే వీటి నిర్మాణాలు భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవు అంటున్నారు ఆయా గ్రామాల రైతులు. ప్రత్యేకించి పాములపాడు మండల కేంద్రం నుంచి చెలిమిల్ల గ్రామానికి వెళ్లే రహదారిలో ప్రస్తుతం అండర్‌పాస్ వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 25 మీటర్ల పొడవు, 7మీటర్లు వెడల్పు, ఓ వైపు 7 మీటర్ల ఎత్తు, మరో వైపు 6 మీటర్ల ఎత్తుతో నిర్మాణ పనులు చేపట్టినట్లు అంచనా. కొంతమేర మలుపు ఉండటంతో ఎత్తు నిర్మాణంలో తేడా ఉందనే విమర్శలు ఉన్నాయి. అండర్ పాస్ గుండా పాములపాడు మండలంలోని లింగాల, చెలిమిల్ల గ్రామాలతో పాటు కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. అదేవిధంగా కొలనుభారతి క్షేత్రం, సప్తనదుల సంగమేశ్వరానికి ఈ దారిలోనే భక్తులు, యాత్రీకులు వెళ్లాల్సి ఉంటుంది. కేవలం 6 మీటర్ల ఎత్తు ఉండే అండర్‌పాస్ వంతెనలో భారీ వాహనాల్లో పంట దిగుబడులు తరలించడం చాలా కష్టం. ఇప్పటికే ఆయా గ్రామాల రైతులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా స్పందన లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే వంతెన నిర్మాణంలో మార్పు చేయడం వీలుకుదరదంటున్నట్లు సమాచారం. దీంతో తమ సమస్యలు పట్టించుకునే నాథుడు కరువయ్యారని ఆయా గ్రామాల రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కంబాలపల్లి గ్రామం వద్ద నిర్మించని సర్వీస్ రోడ్డు...

మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామంలో హైవే పనులు చురుగ్గా సాగుతున్నాయి. అయితే సర్వీస్ రోడ్డు నిర్మించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ గ్రామం నుంచే ఇస్కాల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ఉంది. శ్రీశైలానికి ప్రథమ ద్వారమైన నందిశ్వరాలయానికీ ఈ రహదారి గుండా వెళ్లాల్సిందే. అటు వైపు రాకపోకలు సాగించే ప్రతి ఒక్కరూ ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ గ్రామంలో బాదర్ల స్వామి దర్గా ఉంది. ప్రతి సంవత్సరం ఉరుసు వైభవంగా నిర్వహిస్తారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా హాజరవుతారు. రాత్రి వేళలో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. సర్వీసు రోడ్డు లేకపోవడంతో నేషనల్‌హైవే రహదారిపై అడ్డంగా రాకపోకలు సాగించాల్సి వస్తుంది. అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశాం



పాములపాడు వద్ద వంతెన నిర్మాణం చిన్నగా ఉంది. చాలా ఇబ్బందిగా ఉంది. కనీసం సర్వీసు రోడ్డు నిర్మాణం కూడా చేపట్టలేదు. ఈ విషయాలపై జిల్లా కలెక్టర్, నేషనల్ హైవే పీడీలకు వినతి పత్రాలు సైతం అందజేశాం. పూర్తిగా పరిశీలించి రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

–ముర్తుజావలి, కో ఆప్టెడ్ మెంబరు, పాములపాడు.

చిన్న వంతెనతో ఇబ్బందులే



చెలిమిల్ల రహదారిలో నిర్మిస్తున్న వంతెన చూస్తుంటే చిన్నగా కనపడుతుంది. ప్రతి రోజు వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతున్నాయి. రైతులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఎదురెదురుగా వచ్చే వాహనాలతో ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన విస్తరణకు చర్యలు తీసుకోవాలి.

– కోట్ల చంద్రారెడ్డి, సర్పంచ్, చెలిమిల్ల గ్రామం

భారీ లోడు వెళ్లే అవకాశం ఉండదు



ప్రస్తుతం ఎన్‌హెచ్ 340సీ నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న వంతెనలో దిగుబడులకు సంబంధించి లోడుతో వాహనాలు వెళ్లే వీలుండదు. చాలా ఇబ్బందిగా ఉంటుంది. అధికారులు ఏ ఉద్దేశంతో చేపడుతున్నారో అర్థం కావడం లేదు. ఇంత చిన్నగా వంతెన నిర్మాణం చేపట్టడం ఏ మాత్రం మంచిది కాదు. భవిష్యత్తులో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులు మరోమారు వంతెన నిర్మాణపై ఆలోచించాలి.

–అంబయ్య, లింగాల

చౌకదుకాణం డీలర్ నియామకానికి దరఖాస్తు చేసుకోండి

పగిడ్యాల: మండల కేంద్రం పగిడ్యాలలోని 1309001 చౌకదుకాణ డీలర్ నియమానికి అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శివరాముడు మంగళవారం ఓ ప్రకటనలో సూచించా రు. కొంత కాలంగా ఖాళీ అయిన పగిడ్యాల 01 డీలర్ షాపునకు శాశ్వత ప్రాతిపదికన డీలర్‌ను నియమించేందుకు ఆర్డీఓ నోటిఫికేషన్ జారీ చేశారని వెల్లడించారు. ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ అయిన 18 నుంచి 40 ఏళ్ల వయసు మహిళలు అర్హులన్నా రు. ఈనెల 23వ తేది సాయంత్రంలోగా ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు అభ్యర్థుల మూడు పాస్‌ఫోర్ట్ సైజ్ ఫోటోలు జత చేయాలన్నారు. రాత పరీక్ష ద్వారా ఎంపిక ఉంటుందని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 29వ తేది ఆది వారం ఉదయం 11 గంటలకు ఆత్మకూరు పట్టణంలో రాత పరీక్ష ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక

నందికొట్కూరు: పట్టణంలోని కేసీ కెనాల్ ఇంజినీరింగ్ కార్యాలయంలో డిస్ట్రిబ్యూటరీ 0–120 కిలో మీటర్ల వరకు ఉన్న కేసీ కెనాల్‌కు సంబంధించి డిస్ట్రిబూటరీ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌గా జూపాడుబంగ్లా మండలంలోని 80 బన్నూర్ గ్రామానికి చెందిన కట్ట పరమేశ్వరరెడ్డి, కోడుమూరు నియోజకవర్గంలోని ఎదురూర్ గ్రామానికి చెందిన రైతు రమణ వైస్ చైర్మన్‌గా ఎంపికయ్యారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు.

పాత ముచ్చుమర్రిలో రెవెన్యూ సదస్సు

పగిడ్యాల: మండలంలోని పాత ముచ్చుమర్రి గ్రామంలో మంగళవారం తహసీల్దార్ శివరాముడు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం 9 మంది రైతులు భూ సమస్యలపై అర్జీలు ఇచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. గంట ఆలస్యంగా సదస్సు ప్రారంభం కావడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈనెల 19న కొత్త ముచ్చుమర్రి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌శ్రీరంగారెడ్డి, సర్వేయర్ జ్ఞానప్రకాష్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్‌లు తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని 80బన్నూరు గ్రామంలో మంగళవారం డిప్యూటీ తహసీల్దార్లు సత్యదీప్, నాగన్న రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై 8మంది రైతులు వినతులు అందజేశారని వారు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అతీఫ్, వీఆర్వోలు అల్లావుద్దీన్, సాయిబాబా, బాలకృష్ణ, చంద్రశేఖర్‌నాయుడు, ఈశ్వరయ్య, సర్వేయర్లు సుధాకర్, మాధవ్, కిషోర్, వసీం, శివ, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.


వినతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శివరాముడు


తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న రైతు

మిడుతూరు: మండల పరిధిలోని బైరాపురం గ్రామంలో మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలపై 14 మంది రైతులు వినతులు అందజేశారని తహసీల్దార్ తెలిపారు. మండల సర్వేయర్ కృష్ణుడు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సునీల్ రాజు, ఆర్ఐ జహంగీర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

పాములపాడు: ప్రజల నుంచి వచ్చే ప్రతి భూ సమస్యకు పరిష్కారం చూపుతామని తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని యర్రగూడూరు గ్రామంలో ఆమె రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 10 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రాజు, డీటీ పఠాన్‌బాబు, రీ సర్వే డీటీ సుప్రియ, ఆర్ఐ ఖాజాబీ, వీఆర్వోలు ముర్తుజావలి, శివన్న, వెంకటేశ్వర్లు, పురంధరుడు, శ్రీనివాసులు, కలిముల్లా తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని ఎర్రమఠం గ్రామంలో మంగళవారం ప్రత్యేకాధికారి చింతామణి, తహసీల్దార్ ఉమారాణి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచు బాల ఎల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఏడుగురు రైతులు భూమి సర్వేకు, నలుగురు రైతులు ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించాలని వినతులు అందజేశారని రెవెన్యూ అధికారులు తెలిపారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు అవసరం

నందికొట్కూరు: వృద్ధులకు వైద్య పరీక్షలు అవసరమని, సబ్‌జైలులో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి, డిప్యూటి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం. శివరామ చంద్రరావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సబ్‌జైలులో ఉన్న వృద్ధాప్య ఖైదీలకు న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యులు ఖైదీలకు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదిని నియమించుకోలేని వారికి న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ జనార్ధన్, న్యాయవాది అరుణ్‌కుమార్, ఎంఎల్ఎస్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లీలా వెంకటశేషాద్రి

అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల ధర్నా


ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

శ్రీశైలంప్రాజెక్ట్: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకులాల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు మంగళవారం శ్రీశైలం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నంద్యాల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు 33 రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నారు. అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులను కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లుగా మార్పు చేయాలని, నాన్‌టీచింగ్ కేడర్ కన్నా తక్కువ జీతాలు ఇస్తున్నారని, 2022 పీఆర్‌సీ ప్రకారం జీతభత్యాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

ఫీల్డ్‌అసిస్టెంటు కుటుంబాన్ని ఆదుకోవాలి

జూపాడుబంగ్లా: అనారోగ్యంతో మృతి చెదిన గ్రామ ఫీల్డ్‌అసిస్టెంటు బాలస్వామి(39) కుటుంబానికి ప్రభుత్వం రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోసిక తిరుమలేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, సీపీఎం నాయకుడు రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కర్నూలు జిల్లా కోర్టు పీపీ వెంకటరెడ్డి తరిగోపుల గ్రామానికి చేరుకొని మృతుడు బాలస్వామి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియాతోపాటు ఆయన భార్యకు ఫీల్డ్‌అసిస్టెంటుగా ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. అదేవిధంగా ఏపీఓ గౌరీబాయి, ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఈసీ, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు తరిగోపుల గ్రామానికి చేరుకొని సంతాపం తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు అందజేశారు.


బాలస్వామికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

నందికొట్కూరు: మండల పరిధిలోని కొణిదేల గ్రామానికి చెందిన తెలుగు తిరుపాలు కుమారుడు తెలుగు మల్లికార్జున(25) పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు మృతుడు తాగుడుకు బానిసై ఏ పని చేయకుండా తిరిగేవాడు. జీవితంపై విరక్తి చెందిన యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు టౌన్ ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు పోలీసులు తరలించారు. పోస్టుమార్టం పూర్తి చేయించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు.

షేక్ హీనాబీ హత్య కేసులో ఇద్దరు అరెస్టు

నందికొట్కూరు: మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో ఈ నెల 14వ తేదీన అర్ధరాత్రి షేక్ హీనాబీ అనే మహిళ హత్య కేసుకు సంబంధించి ఇద్దరిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ సుబ్రమణ్యం మంగళవారం తెలిపారు. 10 బొల్లవరం గ్రామంలో ఆర్టీసీ బస్సు స్టాప్ వద్ద ఉన్న షేక్ రహంతుల్లా, షేక్ నజీమున్‌ను అరెస్టు చేశామన్నారు. జడ్జి ఎదుట హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు రూరల్ సీఐ చెప్పారు.

శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగనల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్ర పాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామికి మంగళవారం సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో వీరభద్రునికి , నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. నందీశ్వర స్వామికి నూతన వస్త్ర సమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

వెలుగోడు: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో లిటిల్ ఏంజెల్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కరెస్పాండెంట్ డాక్టర్ ఎం ఎఫ్ ఇమ్మానియేల్ తెలిపారు. మంగళవారం విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి ఐట నేషనల్ ఐటీఎఫ్ టైక్వాన్-డు ఛాంపియన్‌షిప్-2024 పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు వై నాగజస్వంత్ రెడ్డి గోల్డ్ మెడల్, ఎస్ ఇర్ఫాన్, ఎస్ తేజస్ గౌడ్ ప్రతిభ చాటి బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. అంతకు ముందు స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి పాఠశాల వరకు విజేతలతో కలిసి పాఠశాల వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన ఉపాధ్యాయురాలు అప్పియ ప్రశాంత, కరాటే మాస్టర్ చంద్రగౌడ్ పాల్గొన్నారు.

వేతనాలు మంజూరు చేయాలి

ఆత్మకూరు: పాఠశాలల మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను మంజూరు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రాంనాయక్ డిమాండ్ చేశారు. ఎంఈఓ కార్యాలయం వద్ద మంగళవారం వినతి పత్రం అందజేసి నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు, స్కావెంజర్లకు వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలంటే మెస్ చార్జీలు పెంచాలని, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం ఎంఈఓ బాలాజీనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వంట నిర్వాహకులు, సీఐటీయూ నాయకులు రమిజాబీ, శంషాద్, రణధీర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



ఎంఈఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న వంట నిర్వాహకులు

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఆత్మకూరు: రైతులు రబీ పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని బాపనంతపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినుము, మొక్కజొన్న పంటలకు వివిధ తెగుళ్లు వ్యాపించాయని, సస్యరక్షణ చర్యలు చేపట్టి కాపాడుకోవాలని సూచించారు. కొందరు రైతులు రబీ సీజన్‌లో పంట పొలాల్లో విత్తనాలు వేయలేదని, ఈ పంటలకు భూసార పరీక్షలు తప్పని సరిగా నిర్వహించుకోవాలని చెప్పారు. అనంతరం రైతులు విత్తనశుద్ధి, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వ్యవసాయ, పట్టుపరిశ్రమ అధికారులు అరుణ, రాజశేఖర్, ముర్తుజావలి, రవిగౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి

ఆలయ కమిటీ అధ్యక్షుడిగా సత్యనారాయణ

ఆత్మకూరు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా నరహరి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయ కమిటీ ఎన్నికకు మంగళవారం ఏర్పాట్లు చేశారు. అధ్యక్ష పదవికి నరహరి సత్యనారాయణ, భీమిశెట్టి కృష్ణుడు పోటీ పడ్డారు. దీంతో మొదట్లో ఆర్యవైశ్యులు రెండు వర్గాలుగా విడిపోయి ఓ వర్గం భీమిశెట్టి కృష్ణకు, మరో వర్గం నరహరి సత్యనారాయణకు మద్దతుగా నిలిచారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు మహేష్ ఆధ్వర్యంలో చర్చలు జరిపి చివరికి నరహరి సత్యనారాయణను జిల్లా కమిటీ అధ్యక్షులుగా ఎంపిక చేశారు. పదవీ కాలం మూడేళ్లపాటు ఉంటుంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నూతన అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తన ఏకగ్రీవ ఎంపికకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అధ్యక్షుడిని ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు.


సత్యనారాయణను సన్మానిస్తున్న నాయకులు

● 'నంది'కి అరుణవర్ణ గొడుగు



మహానంది: అందాలను ఆవిష్కరించడంలో ప్రకృతిని మించిన చిత్రకారుడు ఉండడనటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. సూర్యోదయం, సూర్యాస్తమయ వేళలో ఆకాశంలో అగుపించే అందాలు ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తుంటాయి. ఈ క్రమంలో మహానందిలోని రెండో లేపాక్షిగా ప్రసిద్ధి చెందిన రాతి నంది వెనుక నింగి ఎరుపురంగులో ఉండగా అందంగా అగుపించిన ఈ దృశ్యాన్ని మంగళవారం సాక్షి కెమెరాలో బంధించింది.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తుంది

మిడుతూరు: పరిధిలోని చెరుకుచెర్ల, తిమ్మాపురం గ్రామాల్లో మంగళవారం ఏఓ పీరునాయక్ పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. సాగు మెళకువలను ఏఓ రైతులకు వివరించారు. శనగ పంటను ఆశించే పురుగల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఓ వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ అశోక్, అగ్రికల్చర్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఏఓ పీరునాయక్

పొలం పిలుస్తోంది ఎంతో ఉపయుక్తం

వెలుగోడు: పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఏఓ పవన్ కుమార్ తెలిపారు. మంగళవారం జమ్మి నగర్ తండా పొలంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ పాల్గొని మాట్లాడారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. భూసార పరీక్ష ఆధారిత ఎరువులు మాత్రమే వాడాలని, పెట్టుబడి ఖర్చులు తగ్గించి ఆర్థికంగా రైతులు లాభసాటి వ్యవసాయం చేయాలని తెలిపారు. అనంతరం క్షేత్రస్థాయిలో మినుము పంటను పరిశీలించి రాత్రివేళ తక్కువ ఉష్ణోగ్రతలు ఉన్నందున మంచుకు తెగులు సోకే అవకాశం ఉందని సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది అంజిత్ కుమార్ రెడ్డి, సుధారాణి, వ్యవసాయ సహాయకులు రామకష్ణ నాగమణి పాల్గొన్నారు.

పెన్షనర్లు జీవన ప్రమాణ పత్రాలు అందించాలి

నందికొట్కూరు: పెన్షనర్లు జీవన ప్రమాణ పత్రాలు ఫిబ్రవరిలోపు అందించాలని నంద్యాల జిల్లా డీటీఏఓ ఎం. లక్ష్మీదేవి స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని పెన్షనర్ల కార్యాలయం వద్ద ప్రభుత్వ పెన్షనర్ల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీటీఏఓతోపాటు నందికొట్కూరు ఎస్‌టీఓ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 2025 క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పెన్షనర్ల సంఘం గౌరవాధ్యక్షుడు విశ్వేశ్వర కుమార్, కోశాధికారి సుబ్బారావు, ఉపాధ్యక్షులు రాజశేఖరరెడ్డి, సుబ్బారాయుడు, ప్రసాద్, రామలింగేశ్వరరెడ్డి, మద్దిలేటి, ఎన్‌జీవో తాలుకా అధ్యక్షుడు రాముడు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మీదేవి

సుఖ వ్యాధులపై అవగాహన సదస్సు

ఆత్మకూరు: స్థానిక కొత్తబస్టాండ్ ఎదురుగా మంగళవారం మెరీబాస్ స్వచ్ఛంద సంస్థ, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సుఖ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ సూపర్‌వైజర్లు రవికుమార్, మస్తాన్, శ్రీరాములు, మెరీబాస్ ప్రాజెక్టు మేనేజర్ రుబికర్ అలీలు మాట్లాడుతూ సుఖ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఐవీ కేసులను నివారించేందుకు ప్రభుత్వం, మెరీబాస్ స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. అనంతరం సుఖవ్యాధులపై కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మెరీబాస్ సంస్థ ప్రతినిధులు లక్ష్మీనరసమ్మ, అరుణకుమారి, సంజమ్మ, సరస్వతి, గౌసియా, కీర్తి పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం